నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

సమీక్షా సమావేశంలో విద్యుత్ అధికారులు

కంఠేశ్వర్, జనవరి 29: వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించడమే లక్ష్యమని చీఫ్ ఇంజినీర్ (ఆపరేషన్స్), జిల్లా నోడల్ అధికారి బూస అశోక్ అన్నారు. ఎస్ఈ, డీఈలు, ఏడీఈలతో జిల్లా కేంద్రంలోని పవర్‌హౌస్‌లో ఉన్న ఎస్ఈ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో కొత్తగా ఆరు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను రూ.ఆరు కోట్లతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.13.1 కోట్లతో 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్స్, 41 టీ మంజూరు చేసినట్లు తెలిపారు. వాటి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. రూ.6.47 కోట్లతో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ స్థాయి పెంచడంతోపాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిజామాబాద్ నగరం, బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో అధికలోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించామని, వాటి స్థాయి కూడా పెంచామని తెలిపారు. రూ.ఐదు కోట్లతో కొత్తగా వీసీబీలు ఏర్పాటు చేసే పనులు కొనసాగుతున్నాయని అన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా, నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. జరుగుతున్న పనులను వేగవంతం చేసి ఫిబ్రవరిలోపు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్ఈ (ఆపరేషన్స్) రాపల్లి రవీందర్, ట్రాన్స్‌కో ఎస్ఈ సూర్య నర్సింహారావు, డీఈలు ఎ.రమేశ్, పివి.రాజేశ్వర్‌రావు, జాడె ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో మూడో స్థానం

ఎన్‌పీడీసీఎల్ కంపెనీలో ఉత్తమ సేవల్లో జిల్లా 3వ స్థానంలో నిలిచిందని చీఫ్ ఇంజినీర్ బూస అశోక్ తెలిపారు. జిల్లా ఎస్ఈ రాపల్లి రవీందర్‌కు సర్టిఫికెట్, జ్ఞాపికను బహూకరించారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన డీఈలు, ఏడీలు, ఏఈలను అభినందించారు. జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు.

రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

వర్ని పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రుద్రూర్, జనవరి29: విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతోపాటు మెనూ ప్రకారం భోజనం అందజేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ గది, ఇన్‌పేషంట్ వార్డు, హెల్ప్ డెస్క్, వ్యాక్సినేషన్ గది, డ్రగ్స్ రూమ్‌లను పరిశీలించారు. మందుల నాణ్యత, కాల పరిమితి తేదీలను పరిశీలించారు. రోగులపై మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పాత వర్నిలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలతో పాటు మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వంటగదిలో కూరగాయలు, పప్పులు, బియ్యం తదితర సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నత పాఠశాలలో తరగతి గదులు కొరత ఉందని హెచ్ఎం కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అదనపు తరగతి గదుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్, ఎంఈవో సాయిలు ఉన్నారు.

యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలి

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, జనవరి 29: రాజ్యాంగ హక్కులను కాలరాసేలా కొత్తగా తయారుచేసిన యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీయూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలను కార్పొరేటీకరణ చేసేందుకు యుజీసీలో కొత్తగా నిబంధనలను తీసుకువచ్చారని అన్నారు. నూతన నిబంధనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూ నాయకులు ప్రిన్స్, దేవిక, అక్షయ్, బిందు, తిరుపతి, మధు, రాజేందర్, భీమేశ్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

యూజీసీ నూతన ముసాయిదాను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముద్రించిన వివిధ డిమాండ్ల కరపత్రాలను బుధవారం టీయూ వీసీ ప్రొఫెసర్ టి.యాదగిరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమ్మరి రాజ్‌కుమార్, టీయూ అధ్యక్షుడు జంగిలి శివ మాట్లాడుతూ యుజీసీ నూతన నిబంధనలతో ఉన్నత విద్యలో మరింత అసమానతలు పెరిగి పేదలకు విద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీయూ ఎస్ఎఫ్ఐ నాయకులు చణ్, పృథ్వీ, సంతోష్, కిరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

ఇందల్వాయి, జనవరి 29: చోరీకి పాల్పడిన నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ తెలిపారు. బుధవారం డిచ్‌పల్లి సీఐ కార్యాలయంలో ఎస్సై మనోజ్‌కుమార్‌తోకలిసి వివరాలను సీఐ వెల్లడించారు. సీఐ కథనం ప్రకారం.. ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన ఆసాది రాజేశ్వరి ఇంట్లో ఈనెల 25న రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు మోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన నిందితుడు ఆసాది రాజేశ్‌తోపాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన నిజామాబాద్‌కు చెందిన తరుణ్‌ను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నగదు, బంగారు ఆభరణాలు, సోల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

కోటగిరి, జనవరి 29: అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు మిర్జాపూరం చిన్న సాయన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పద్మ అవార్డుల విషయంలో గద్దర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మాల మహానాడు నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కాలే సాయిలు, బేగరి రాములు, పాల గంగారాం, జంగం సాయిలు, కొత్తపల్లి మారుతి, సైదయ్య, సుంకిని సాయిలు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

రుద్రూర్, జనవరి29: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో బుధవారం జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పెంపుడు కుక్కలకు టీకాలు వేయించారు. పశువైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ.. 15పెంపుడు కుక్కలకు ఆంటీ రెబీస్ టీకాలను వేసినట్లు తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సాయిరాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భ కోశ వ్యాధి నివారణ టీకాలు

ఖలీల్‌వాడి(మోపాల్), జనవరి 29: మండల కేంద్రంలో గర్భకోశ వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించారు. 502 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు ఇచ్చినట్లు వైద్యుడు గంగాధర్ తెలిపారు. 30 దూడలను పరీక్షించి వైద్యం అందిచారు. వైద్య సిబ్బంది మజ్జు, గోపికృష్ణ, శిరీష, బాబూరావు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్, జనవరి29: మండల కేంద్రంలో వేబిల్ లేకుండా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. మొరం తరలించేందుకు అనుమతులు తీసుకున్నప్పటికీ వేబిల్ లేకుండా మొరం తరలించడం సరికాదని ట్రాక్టర్ యజమానులను మందలించారు. మరోసారి పునరావృతం కావొద్దని ట్రాక్టర్ యజమానులను తహసీల్దార్ తారాబాయి హెచ్చరించారు.

కాలువ కబ్జాపై అధికారులు స్పందించాలి

కోటగిరి, జనవరి 29: మండల కేంద్రంలోని నిజాంసాగర్ కాలువ సరిహద్దును కబ్జా అవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 20 రోజుల నుంచి కబ్జాలపై ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు గురువారం మండల కేంద్రానికి వస్తారని తెలిపారు. కెనాల్‌ను పరిశీలిస్తారని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు రాజు, దత్తు, గంగాధర్, రాములు, రవి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

భీమ్‌గల్, జనవరి 29 : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో సంతోష్ పాఠశాల సిబ్బందికి సూచించారు. మండలంలోని మెండోరా ప్రభుత్వ పాఠశాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, సిలబస్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాడ్లాడారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి 29 : డివిజన్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటించని, అర్హతలేని ఉపాధ్యాయులతో విద్యనందిస్తున్న ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆర్మూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గోపాల్‌సింగ్ డీఈవో కార్యాలయ సిబ్బందికి బుధవారం వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐసీయూఎస్ నాయకులు ఉన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

మోస్రా (చందూర్), జనవరి29: మోస్రా మండలంలోని గోవూర్ జీపీని ఎంపీవో వెంకటేశ్వరు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ పరీక్షలు

బాల్కొండ, జనవరి 29 : మండలంలోని కిసాన్‌నగర్ భవిత సెంటర్‌లో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ బుధవారం తెలిపారు.రిసోర్స్ టీచర్ రాజనర్సయ్య, ఫిజియోథెరపీ డాక్టర్ అరుణ, సీఆర్పీ శోభ పాల్గొన్నారు.

స్థలం పరిశీలన

సిరికొండ, జనవరి29: మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు బుధవారం తహసీల్దార్ రవీందర్‌రావు స్థలాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ వెనకాల ఉన్న స్థలాన్ని సర్వేయర్‌తో కలిసి పరిశీలించామని తహసీల్దార్ పేర్కొన్నారు.

క్రీడాదుస్తుల వితరణ

మోర్తాడ్(వేల్పూర్), జనవరి 29 : వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామ ప్రభుత్వప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఏసీఎస్ చైర్మన్ లింబారెడ్డి క్రీడాదుస్తులను బుధవారం అందజేశారు. క్రీడాదుస్తులను అందించిన యువరైతు, బాక్సింగ్ అకాడమీ చైర్మన్ కానూర్ సంజీవ్‌ను సన్మానించారు. హెచ్ఎం మల్లేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో బడిబయటి పిల్లల చేరిక

చందూర్, జనవరి29: మండల కేంద్రంలో బుధవారం బడిబయటి పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి, 8వ తరగతిలో ఎంఈవో శ్రీనివాస్ సమక్షంలో చేర్పించినట్లు ఉపాధ్యాయుడు సాయిలు తెలిపారు. పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి 29: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ నాయకులు ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడారు.కార్యక్రమంలో అనిల్‌కుమార్, నిఖిల్, వినోద్, సాయిరాజ్, మమత పాల్గొన్నారు.

'టీయూ స్పోర్ట్స్ డైరెక్టర్‌పై ఆరోపణలు సరికాదు'

డిచ్‌పల్లి, జనవరి 29: టీయూ స్పోర్ట్స్ డైరెక్టర్‌పై ఐదు రోజుల క్రితం ఒక విద్యార్థి సంఘం నాయకులు చేసిన అవినీతి ఆరోపణల్లో వాస్తవం లేదని యూనివర్సిటీ క్రీడాకారులు అన్నారు. పలువురు విద్యార్థులు బుధవారం తెలంగాణ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ యాదగిరిరావును కలిసి వివరించారు. ఆరోపణలు చేసిన ఆ సంఘంపై చర్యలు తీసుకోవాలంటూ వీసీకి వినతిపత్రం అందజేశారు. క్రీడాకారులు హరీశ్, నరేశ్, మనోహిత్, నిఖిల్, రాకేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

డిచ్‌పల్లి, జనవరి 29: మండల కేంద్రంలోని మానవ సదన్‌లో విద్యార్థులకు రిటైర్డ్ ఆర్డీవో వెంకటయ్య దంపతులు వారి పెళ్లిరోజును పురస్కరించుకుని పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సదన్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉన్నారు.

2న ఈత కొలను ప్రారంభం

కంఠేశ్వర్, జనవరి 29: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సుభాష్‌నగర్‌లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఈత కొలను వచ్చేనెల 2న ఉదయం 6 గంటలకు ప్రారంభించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు స్విమ్మింగ్ కోచ్ మహిపాల్‌రెడ్డి 98669 70010ని సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి, జనవరి 29: మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అంతుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహిస్తారని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

మాక్లూర్, జనవరి 29 : మండలంలోని దాస్‌నగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ధాత్రిక వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించడానికి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఫిబ్రవరి 4వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 5న ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలుశిక్ష

మోర్తాడ్/భీమ్‌గల్/మెండోరా, జనవరి 29 : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన సాదుల శ్రీనివాస్, భీమ్‌గల్‌కు చెందిన విభూది దేవీదాస్, మెండోర మండలం వెల్గటూర్ గ్రామానికిచెందిన చల్ల చంద్రశేఖర్‌కు బుధవారం ఆర్మూర్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఒక్కొక్కరికీ రెండురోజుల చొప్పున జైలుశిక్ష విధించారు. ఈ విషయాన్ని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి, భీమ్‌గల్ ఎస్సై మహేశ్, మెండోర ఎస్సై జి.నారాయణ తెలిపారు.

శక్కర్‌నగర్, జనవరి 29 : బోధన్ పట్టణంలో వాహనాల తనిఖీలో భాగంగా మద్యం సేవించి వాహనం నడిపిన జింక గంగాధర్ అనే వ్యక్తిని బుధవారం బోధన్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. సదరు వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప శాయి తీర్పు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని

భీమ్‌గల్, జనవరి 29 : జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు మండలంలోని బడాభీమ్‌గల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పి.కీర్తి సుధ ఎంపికైనట్లు పాఠశాల పీడీ భూపతి బుధవారం తెలిపారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షుడు రవిగౌడ్, సెక్రటరీ మల్లేశ్‌గౌడ్, పాఠశాల హెచ్ఎం కృష్ణస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.

పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

పసుపుపంట గురించి వ్యవసాయ విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

మోర్తాడ్, జనవరి 29 : కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రాన్ని జగిత్యాల జిల్లా పూడూరు వ్యవసాయ విద్యార్థులు బుధవారం సం దర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మహేందర్, శ్రీనివాస్‌రావు విద్యార్థులకు వివిధ రాష్ట్రాల్లో పండించే పసుపు రకాలు, మార్కెట్‌లో వాటికి ఉన్న డిమాండ్, మన ప్రాంతంలో పండే పసుపు రకాల గురించి తెలిపారు. పసుపు క్షేత్రానికి తీసుకెళ్లి పసుపు పండించే విధానాలు, పంటకు వచ్చే తెగుళ్లు, ఉపయోగించే పరికరాలు, కేంద్రంలో చేస్తున్న పరిశోధనల గురించి వివరించారు. విద్యార్థులవెంట రైతు రామిరెడ్డి ఉన్నారు.

దమ్ముంటే అభివృద్ధికి నిధులు తీసుకురా!

- పట్టణ అభివృద్ధికి పాటుపడింది మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకుల సవాల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భీమ్‌గల్, జనవరి 29 : మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న భీమ్‌గల్‌ను మున్సిపాలిటీగా మార్చి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను ఒప్పించి చిన్న మున్సిపాలిటీ అయినా రూ. 25 కోట్ల నిధులు తీసుకొచ్చి, పట్టణాన్ని అభివృద్ధి పథంలో పెట్టిన నాయకుడు మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చొరవతో రూ.11.50 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఆయన ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలోనే రూ. 10 కోట్ల నిధులతో పాటు కల్యాణ మండప నిర్మాణం కోసం రూ.కోటిన్నర నిధులను వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేయించారని, ఇప్పుడు ఆయన కొత్తగా మంజూరు చేయించానంటూ గప్పాలు కొడుతున్నాడని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం చేసిన పనులను రద్దు చేయడమే కాకుండా పట్టణ అభివృద్ధికి సునీల్‌రెడ్డి అడ్డుపడుతున్నాడన్నారు. కేసీఆర్ హయాంలోనే పట్టణంలో వంద పడకల దవాఖాన, వెజ్- నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం ప్రారంభమయ్యాయని, కల్యాణ మండపం, పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, బీటీ రోడ్ల నిర్మాణాన్ని చాలా వరకు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రారంభించిన వంద పడకల దవాఖాన నిర్మాణ పనులు ఏడాదిగా నత్తనడకన కొనసాగుతున్నాయని మండిపడ్డారు. వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ పనులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జరగడం లేదని, నిధులు రాకపోవడంతో మధ్యలోనే ఆగిపోయాయన్నారు. పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే వేముల కట్టుబడి ఉన్నారన్నారు. దమ్ముంటే ముఖ్యమంత్రిని ఒప్పించి పట్టణ అభివృద్ధికి రూ. ఐదుకోట్ల నిధులు తీసుకురావాలని సవాల్ విసిరారు. సమావేశంలో కౌన్సిలర్లు బొదిరే నర్సయ్య, మూత లింబాద్రి, మల్లెల ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు మూత అశోక్, నీలం తదితరులు పాల్గొన్నారు.

చిన్న ఊర్లనే పైలట్ గ్రామాలుగా ఎంపికచేయడంలో మతలబు ఏమిటో?

- బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా

ఆయేషా ఫాతిమా

బోధన్, జనవరి 29 : రైతు భరోసా పథకం అన్ని గ్రామాలకు ఒకేసారి అమలు చేయాల్సి ఉండగా, అది జరగకపోగా నియోజకవర్గంలో మండలానికొక చిన్న ఊరును పథకం అమలుకోసం పైలట్ గ్రామాలు అంటూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఎంపికచేయడంలో ఆయన మతలబు ఏమిటని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆమె మీడియాకు ఒక ప్రకటన విడుదలచేశారు. అన్ని గ్రామాలకు ఒకేసారి, అది కూడా వెంటనే సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పలుకుబడి ఉండి, జిల్లాలో అనధికారికంగా ఒక మంత్రికి ఉండాల్సిన ప్రొటోకాల్‌ను పొందుతున్న సుదర్శన్‌రెడ్డి.. ఏడాది తర్వాత కూడా అమలు చేయని పథకం కోసం చిన్న గ్రామాలను ఎంపిక చేసుకోవడం విడ్డూరంగా ఉన్నదని విస్మయం వ్యక్తం చేశారు. చిన్న ఊర్లను పైలట్ గ్రామాలుగా అధికారులు ఎంపిక చేసిన విషయం అధికారులు తనకు తెలిపారో లేదో అన్న సందేహం కలుగుతున్నదన్నారు. అన్ని గ్రామాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా.. ఇప్పటివరకు వాటిని అమలు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పుడు చిన్న ఊర్లను ఎంపిక చేసుకుని రైతు భరోసా అమలంటూ చెప్పుకోవడం తగదని, వెంటనే అన్ని గ్రామాలకు సంక్షేమ పథకాల ఫలితాలను అందించాలని ఆమె డిమాండ్ చేశారు.

కాల్వను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

కాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ, ఏఈ

నవీపేట, జనవరి 29: మండలంలోని రాంపూర్, ఫత్తేనగర్ గ్రామాల్లో కాల్వలను ఇరిగేషన్ ఈఈ బాల్‌రాం, ఏఈ ప్రనయ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. నమ స్తే తెలంగాణ దినపత్రిలో బుధవారం ప్రచురితమైన 'కాల్వను బాగు చేయండి సారూ' అనే కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆయా గ్రామాల రైతులను కలిశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ డీ/50/10/5 కాల్వను పరిశీలించామని, కాల్వలకు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నుంచి ప్రావిజన్ లేదని, ఆయకట్టు రైతులు డబ్బులు జమ చేసుకొని మరమ్మతు చేసుకోవాలని సూచించడంతో వారు అంగీకరించారన్నారు. అయితే తమ పరిధిలో డీ/50 కాల్వను మరమ్మతు చేసే అవకాశం ఉన్నదన్నారు. తాము రైతుల శ్రేయస్సు దృష్ట్యా డీ/50/10 వరకు మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతులు కలిసి కట్టుగా కాల్వను జేసీబీతో పూడిక తీసుకొంటే అలీసాగర్ లిఫ్టు ద్వారా సాగునీటిని విడుదల చేస్తామని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రాంపూర్,